క్లుప్తంగా

11న వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో 11వ తేదీ ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు తెలిపారు. ఆదివారం ఉదయం లోకకల్యాణార్థం నవగ్రహ, రుద్ర, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు 102 మంది ఆర్యవైశ్య కన్యకలతో 102 పూలగంపలతో ఊరేగింపు, పుష్పాభిషేకం, 6 గంటలకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే రాచమల్లు సహకారాన్ని మరువలేం



చెవి ఆపరేషన్ రూ.5.30 లక్షల ఎల్‌ఓసీ పత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అందించిన సహకారాన్ని మరువలేమని మల్లిక తెలిపారు. తన కుమారుడు షారూక్ చెవి ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే రాచమల్లు ద్వారా లేఖ పంపగా రూ.5.30 లక్షలు మంజూరైందన్నారు. గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తామని తెలిపారు. అలాగే ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన వసంత ఓబుళమ్మకు ఐవీఎఫ్ చికిత్స కోసం రూ.4లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు జిలాన్ బాషా, గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను త్వరగా పూర్తి చేయండి



జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

ప్రొద్దుటూరు : జగనన్న కాలనీలకు సంబంధించిన ఇళ్ల పట్టాలను త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం సాయంత్రం గోపవరం, సోములవారిపల్లె గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. పెద్ద మొత్తంలో ఇళ్ల పట్టాలను ప్రభుత్వం ఇచ్చిందని, వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కోరారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమృతానగర్ సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : మండలంలోని అమృతానగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో అమృతానగర్ వాసులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అక్కడి నుండి ర్యాలీగా వెళ్లి పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, లత, హసీనా, రఫీ, రమీజా, పెంచల్ రెడ్డి, చిన్నరాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పదిలో మంచి మార్కులు సాధించాలి



విద్యార్థులకు ప్యాడ్స్ అందిస్తున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : పది, ఇంటర్ పరీక్షలలో ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. గురువారం బి.మఠంలోని బాలయోగి గురుకుల పాఠశాలలోని ఇంటర్, పది విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీలో ఎంపీపీ మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు గతంలో ఇక్కడ చదివిన వారు ఉన్నతి స్థాయిలో ఉన్నారని చెప్పారు. మీరు కూడా పరీక్షలు బాగా రాసి ఉన్నతి స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కొన్ని రోజులను చదువుపై ధ్యాస ఉంచితే మంచి మార్కులు సాధించడమే కాక.. మీ తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25న సిల్వర్ జూబ్లి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అవోపా భవనంలో ఈనెల 25న అవోపా సిల్వర్ జూబ్లి వేడుకలను నిర్వహించనున్నట్లు అవోపా అధ్యక్షుడు గుండా పద్మనాభయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాముని జీవిత చరిత్రపై పోటీ నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.1000 అందిస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 9441050122 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రొద్దుటూరు : ఇన్నేళ్లుగా పట్టణంలో ప్రముఖమైన బీజీఆర్ సందును గత పాలకులు పట్టించుకోలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. బీజీఆర్ లాడ్జి వీధిలో రూ.40 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఈ వీధి 35 అడుగుల రోడ్డు నుంచి 15 అడుగులకు వచ్చిందన్నారు. ఈ ప్రాంత వాసుల సమస్యను గుర్తించి వీధిలో ముందుగా డ్రైనేజీ కాలువలను నిర్మించామని, ప్రస్తుతం గాంధీ రోడ్డు వరకు రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కార్యాలయం ఉన్న నెహ్రూ రోడ్డు, శ్రీరాములపేట, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, జిల్లా ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, కమిషనర్ వి.మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కౌన్సిలర్లు కమాల్, గరిశపాటి లక్ష్మీదేవి, సత్యం, జిలాన్, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, పద్మశాలీయ సేవా సంఘం పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ఓటర్ల జాబితాలో తప్పులుంటే చర్యలు

ప్రొద్దుటూరు : ఓటర్ల జాబితాలో తప్పులుంటే చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖతీబ్ కౌసర్ బాను హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో, తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, బీఎల్‌ఓలతో ఈఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఆర్‌ఓ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించాలని తెలిపారు. ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించాలని సూచించారు. తప్పొప్పులను సరిదిద్దుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణ బాధ్యత మీపైనే ఉందన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ ఖతీబ్ కౌసర్ బాను

కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ప్రొద్దుటూరు, రాజుపాళెం విద్యాసాగర్, విజయశ్రీ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అయజ్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించండి

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు తెలిపారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లోపం, మితిమీరిన వేగంతో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిపై ఆటోడ్రైవర్లు దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా పల్లెలకు వెళ్ళే ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని హెచ్చరించారు. ఎట్టిపరిస్థితుల్లో డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటును ఉపేక్షించబోమన్నారు. ప్రతిఒక్క ఆటోడ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు తమ వాహనాలకు ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలన్నారు. అలాగే ఆటోల్లో సౌండ్ సిస్టమ్స్ కూడా ఉంచరాదన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంవీఐ శేఖర్‌రావు

ఓవర్ లోడ్‌తో ప్రయాణించే ఆటోలపై చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : ఓవర్ లోడ్‌తో ప్రయాణించే ఆటోలపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో గురువారం రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తమ సీటుకు



ప్రొద్దుటూరు క్రైం : మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ యుగంధర్

ఇరువైపులా ప్రయాణికులను కూర్చోపెట్టుకొని వెళ్తున్నారన్నారని సీఐ తెలిపారు. ఇది నిబంధనలకు విరుద్ధమే కాకుండా చాలా ప్రమాదకరమని చెప్పారు. కొందరు ఆటో డ్రైవర్లు 10 మందికి పైగా వ్యవసాయ కూలీలను ఆటోలో తీసుకెళ్తున్నారన్నారు. ఆటోలకు పైన క్యారేజి ఉన్నా కేసులు నమోదు చేస్తామన్నారు. రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలను నడపడం నేరమన్నారు, ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ మురళీధర్, ఆర్టీసీ డిపోమేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఎంవీఐ నారాయణనాయక్, ఏఓ కరిముల్లా, ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బద్వేలులో సంబరాలు

బద్వేలు అర్బన్ : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ఆధారంగా నిర్మించిన యాత్ర-2 సినిమా విడుదల సందర్భంగా గురువారం సినిమా ప్రదర్శించబడుతున్న ఎస్‌ఏఎల్ఎస్ థియేటర్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్‌చేసి భారీగా బాణాసంచా పేల్చి టికెట్ల విక్రయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ యాత్ర-2 సినిమాలో మహానేత వైఎస్ఆర్ మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఓదార్పుయాత్ర, ప్రజాసంకల్ప పాదయాత్ర, అధికారంలోకి వచ్చిన తీరు వంటి సన్నివేశాలు కార్యకర్తల్లో నూతన ఉత్తేజం తెప్పిస్తున్నాయన్నారు. అలాగే ప్రతిపక్షాలు చేసిన కుట్రలు సామాన్య ప్రజానీకం సైతం తెలుసుకునేలా చిత్రాన్ని చక్కగా నిర్మించారన్నారు. విడుదల సందర్భంగా 300 టిక్కెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్ రామిరెడ్డి, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : యాత్ర-2 స్పెషల్ ప్రదర్శన సందర్భంగా గురువారం పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి థియేటర్ బయట కేక్ కట్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. మూవీని వీక్షించిన అనంతరం గోవిందరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర నేపథ్యంలో చిత్రాన్ని తెర కెక్కించారన్నారు. యాత్ర-1కు ప్రజలు బ్రహ్మరథం పట్టారని, మహానేత మనకు దూరమయ్యాక రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలను యాత్ర-2లో చక్కగా చిత్రీకరించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సచివాలయాల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, మండల కో ఆప్షన్ మెంబర్ అల్లా, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మినారాయణరెడ్డి, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవి, మాజీ ఉప సర్పంచ్ నరసింహులు, యూత్ అధ్యక్షుడు గిరిప్రణీత్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లలో లక్ష్యాన్ని పూర్తి చేయాలి

గోపవరం : జగనన్న ఇళ్ళ నిర్మాణాల్లో అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, ఎంపీడీఓ సుబ్రమణ్యంలు తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఇళ్ళ రిజిస్ట్రేషన్లు లబ్ధిదారులకు ఎలాంటి ఖర్చు లేకుండా ఆయా సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందని, లబ్ధిదారులతో మాట్లాడి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కులగణన, జగనన్న పాలవెల్లువ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పంట నమోదు, ఈకేవైసీ, ఇళ్ళ నిర్మాణాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల పురోగతిపై సమీక్షించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల హాజరు వంద శాతం ఉండాలన్నారు. కొందరు సచివాలయ సిబ్బంది విధులకు వస్తున్నా అటెండెన్స్ వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో జిల్లాలో గోపవరం మండలం వెనుకబడి ఉందన్నారు. ఇకమీదట ఇలా జరగకుండా సచివాలయ



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

సిబ్బంది సమయం పాటిస్తూ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా కూడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు అడిగిన కూలీలకు పని కల్పించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, ఏపీఓ విజయమ్మ, ఏపీఎం శివప్రసాద్, డీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యవారిపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'

చాపాడు : మండలంలోని అయ్యవారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇవ్వటం జరుగుతుందని వైద్యాధికారి తెలియజేశారు.

జయగోపాల్ మృతి తీరనిలోటు

చాపాడు : ఆధునిక ఆంధ్ర పెరియార్ డాక్టర్ జయగోపాల్ మరణం తీరనిలోటు అని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు పల్లవోలు రమణ, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు జీడీ సారయ్య గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జయగోపాల్ నాస్తిక సమాజం అనే సంస్థను ఏర్పాటు చేసి ఉమ్మడి ఏపీలోనే కాకుండా 8 రాష్ట్రాల్లో నాస్తిక ఉద్యమ వ్యాప్తి కోసం కృషి చేసిన వ్యక్తి అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల కార్యకర్తలకు అండగా నిలబడుతూ పోరాటం చేశాడన్నారు. 52 ఏళ్లుగా భారత నాస్తిక సమాజం ఉమ్మడి ఏపీలో కుల, మత, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా వాటి నిర్మూలనకు కృషి చేస్తూ దళితుల పైన దాడులకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలను నిర్మించిన ఘనత జయగోపాల్‌కే దక్కిందన్నారు.

సీఎంను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, శివయాదవ్

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాసన మండలి సభ్యులు రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల శివయాదవ్‌లు కలిశారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి యాదవులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలు గుర్తుచేసి అభినందించారు. వైఎస్ఆర్‌సీపీ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని సీఎంకు తెలిపారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



మాట్లాడుతున్న దాసరి సువర్ణరాజు

కడప రూరల్ : వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు అన్నారు. గురువారం సాయంత్రం కడపలోని స్కౌట్ ప్రాంగణంలో మాదిగల సమన్యాయ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ అసెంబ్లీ స్థానాలు 29, పార్లమెంట్ స్థానాలు నాలుగు ఉన్నాయని తెలిపారు. అందులో మాదిగలకు 11 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను కేటాయించి సమన్యాయం చేయాలని కోరారు. కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే పలు ఎమ్మెల్యే స్థానాలతో పాటు మాదిగలకు ఒక ఎంపీ స్థానంలో అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. అలాగే మాదిగ ఉద్యమ కారులపై బనాయించిన కేసులను ఎత్తివేయడం అభినందనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, పూతలపట్టు వెంకటేష్, ఆర్ఎస్ రాజ, శేఖర్, ఎదురూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత సెయింట్ జోసెఫ్ స్కూల్

నందలూరు(రాజంపేట) : స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో పార్లమెంట్ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకుంది. గురువారం అరవపల్లెలోని నందలూరు జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో జరిగిన కబడ్డీ పోటీల్లో దాదాపు 12 జట్లు పాల్గొన్నాయి. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత లోకో పైలట్ షేక్ కమాల్ బాషా ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా బుల్లెట్ హరి, శాంతకుమార్, అజయ్, హరిబాబులు వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పాఠశాల డ్రిల్ మాస్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయండి

- వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పథకాల లబ్ధి
- బూత్ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి బూత్ కన్వీనర్ సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన బి.మఠంలోని రెడ్ల అన్నదాన సత్రంలోని కల్యాణ పండపంలో ఏర్పాటు చేసిన బూత్ కన్వీనర్ల ఒక్క రోజు శిక్షణకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బూత్ కన్వీనర్, కో-కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపేదలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పార్టీలకు కులాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందించారన్నారు. మహిళలు అధికంగా తిరిగి జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజలను ప్రలోభ పెట్టేందుకు ఆచరణకు నోచుకోని హామీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని తెలపాలన్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను 100శాతం అమలు చేశామని తెలపాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే ఇప్పటి పథకాలు అందుతాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే పథకాలు రద్దుచేస్తారని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్, సింగల్ విండో అధ్యక్షుడు నేలటూరి సుబ్బారెడ్డి, మైదుకూరు నియోజకవర్గం జేసీఎస్ కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ఐప్యాక్ ప్రతినిధి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 10, 11వ తేదీల్లో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి 189 ప్రదర్శనలు జిల్లాస్థాయికి ఎంపికయ్యాయని, ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులు బద్వేలులో జరగబోయే జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థినీ విద్యార్థులకు బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, బాలికల వసతిగృహాల్లో సదుపాయాలు కల్పించాలని కోరారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కో ఆర్డినేటర్‌గా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన చెక్కును ఆయనకు అందించారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి మలేశ్వర్‌రెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కో ఆర్డినేటర్‌కు చెక్కును అందజేస్తున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

దౌర్జన్యంగా భూ ఆక్రమణ

ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవెన్యూ అధికారులు

గోపవరం : మండలంలోని గోపవరం రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 64/3లో కొందరు దౌర్జన్యంగా జేసీబీలు ఉపయోగించి భూమిని చదును చేస్తున్నారు. ఇదే సర్వేనెంబరులో కుటుంబ నియంత్రణ చేయించుకున్న వారికి, అర్హులైన పేదలకు రెవెన్యూ అధికారులు గతంలో ఇళ్ళపట్టాలు ఇవ్వడం జరిగింది. అయితే గత రెండు రోజులుగా ఎలాంటి పట్టాలు లేకపోయినా కొందరు స్థలాలను కబ్జా చేసేందుకు జేసీబీలు ఉపయోగించి చదును చేస్తున్నారు. తమకు పట్టాలు ఉన్నాయని, ఇదేమి దౌర్జన్యమని ప్రశ్నించిన వారికి సరైన సమాధానం చెప్పకపోగా తిరిగి వారినే బెదిరిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ వ్యవహారం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో వారి ఆగడాలు మితిమీరిపోతున్నాయి. గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గోపవరం రెవెన్యూ పొలం-2లో 1557 సర్వేనెంబరులో బేతాయపల్లె సచివాలయం పరిధిలోని పి.పి.కుంట వద్ద జగనన్న లేఅవుట్‌కు స్థలాన్ని కేటాయించారు. ఇందులో 15 మంది లబ్ధిదారులకు ఇళ్ళు మంజూరయ్యాయి. ఇప్పటికే 12 ఇళ్ళు పూర్తయ్యాయి. ఇదే లేఅవుట్‌లో మరో 48 మంది ఇళ్ళపట్టాల కోసం స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. వారందరికి స్థలాలు మంజూరయ్యాయి. త్వరలోనే వీరికి జగనన్న లేఅవుట్‌లో స్థలాల పంపిణీ కార్యక్రమం కూడా అధికారులు చేపట్టనున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించి జగనన్న లేఅవుట్ స్థలంలో అక్రమంగా గుడిసెలు వేసేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు సీపీఐ జెండాలు లేఅవుట్ స్థలంలో పాతారు. అర్హులై ఉండి స్థానికులు ఎవరైనా ఇప్పటి వరకు ఇళ్ళ స్థలాలు లేకపోతే వారందరు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఒక పక్క రెవెన్యూ అధికారులు చెబుతున్నా ఎక్కడెక్కడో ఉన్న స్థానికేతరులను రెచ్చగొట్టి భూపోరాటం ద్వారా గుడిసెలు వేసేందుకు ప్రయత్నించడం మంచి పద్ధతి కాదని రూరల్ ఎస్ఐ రవికుమార్ సీపీఐ నాయకులను హెచ్చరించారు. ఇప్పటికైనా భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపాలని ప్రజలు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆక్రమణలకోసం భూమిని చదును చేస్తున్న దృశ్యం

ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు

మైదుకూరు : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును పొందాలంటే ఉన్నత చదువులతోనే సాధ్యమని లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్) పర్యవేక్షక బృందం రాష్ట్ర పరిశీలకుడు ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం లిప్ పర్యవేక్షక బృందం, మైదుకూరు మండలంలోని వనిపెంట బీసీ గురుకుల బాలికల పాఠశాల, లెక్కలవారిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ చదవడం, రాయడం నిరంతరం చేస్తుండాలన్నారు. పాఠ్య పుస్తకాలతోపాటు గ్రంథాలయాల్లోని పుస్తకాలను కూడా చదవడంపై దృష్టి పెట్టాలన్నారు. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలోని మెళకువలను, సాధించాల్సిన అభ్యసన సామర్థ్యాలను విద్యార్థులతో మాట్లాడి ఆయన స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు నోట్స్ చదవడాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ ధనలక్ష్మి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. లిప్ పర్యవేక్షక బృందంతోపాటు మైదుకూరు ఎంఈఓ పద్మలత, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.



మాట్లాడుతున్న లిప్ రాష్ట్ర పరిశీలకుడు ఉపేందర్ రెడ్డి

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

బద్వేలు అర్బన్ : విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకుని చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని సహాయ సాంఘీక సంక్షేమశాఖాధికారి రామయ్య తెలిపారు. స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహం-2లో గురువారం బద్వేలు ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని సెంట్రల్ హాస్టల్ పది విద్యార్థులకు ప్రేరణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి అత్యధిక మార్కులు సాధించాలని కోరారు. విద్యతోనే సమాజంలో గౌరవం ఉంటుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి గ్రహించాలని కోరారు. ప్రేరణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం ఆయా సబ్జెక్టుల నిపుణులు పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ రామయ్య